# డిన్నర్‌కి రమ్మన్నారు

మూడు రోజులపాటు ఢిల్లీలో జరిగిన సెమినార్‌లో నిన్న ఉదయం ఆఖరు సెషన్‌లో అద్భుతంగా మాట్లాడాను. ఇది కేవలం నా అభిప్రాయమే కాదు. మా ప్రొప్రయిటర్-కమ్-మేనేజింగ్ డైరెక్టరు గారైన సోహన్‌లాల్ గులాబ్‌చంద్‌గారి ఉద్దేశం కూడా అదే అని తెలిసి గర్వం కలిగింది. రేపు ఉదయం ఆఫీసుకి రానక్కరలేదు, మధ్యాహ్నం వస్తే చాలునని ప్రొప్రయిటరుగారు దయతో చెప్పారు.

కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ని నేను. సెమినార్‌కి మా ఎం. డి. గారు నన్ను బలవంతంగా తీసుకువెళ్ళారు. మా బ్రాంచి అన్నిటినుంచి మేనేజర్లు, సేల్సు సూపరింటెండెంట్లు, ఏజంట్లు వచ్చారు. ఇతర కంపెనీల ప్రొప్రయిటర్లు మొదలైనవారు దేశం నలుమూలల్నుంచీ వచ్చారు.

ప్రస్తుతం ముడిసరుకుకి ఉన్న ధర, వస్తువులు తయారు కావడానికి చేయవలసిన కృషి, ఖర్చు, మార్కెటింగ్, ఎడ్వర్‌టైజింగ్ లాంటివన్నీ దృష్టిలో పెట్టుకొని, ఇంతకన్నా వస్తువుల ధరను పెంచడంకన్నా, ఇంతకన్నా నాణ్యతను పెంచడం సర్వవిధాలా

శ్రేయస్కరమని నా ఉపన్యాసంలో చెప్పాను. నాణ్యత పెంచక పోవడంవల్ల, పైగా ఏళ్లు గడుస్తున్నకొద్దీ నాణ్యత తగ్గించుకొంటూ పోవడంవల్ల, జనానికి ఈ వస్తువులమీద మోజుపోయే ప్రమాదం ఏర్పడగలదని చెప్పాను. వస్తున్న లాభాలు చాలని, అత్యాశకుపోయి దేశద్రోహం తలపెట్టొద్దని గట్టిగా ఉద్బోధించాను. నా ప్రసంగం టేపు మీద రికార్డయింది. పత్రికా విలేకరులు నా ప్రసంగాన్ని షార్టుహేండులో వ్రాసుకున్నారు.

మధ్యాహ్నం ఇంటి దగ్గర భోజనం చెయ్యడం ఒక అరుదైన అనుభవం. అది మిక్కిలి తృప్తిగా పూర్తి చేసుకుని, రెండు గంటలకి వెళ్ళాను.

"ఇదేమిటి! నా టేబులు వరండాలో వేశారు?" అని అడిగాను, ఎదురుగా వస్తున్న రాంచంద్‌ని. అతను ఎం. డి. గారి పి. ఎ.

"మీ రూం డెకరేషను చేస్తున్నారు సార్."

"నాకు చెప్పకుండానే?" అన్నాను.

"చెబుదామనే అనుకున్నాం. కాని ఆ రూంలో ఇంకమీదట మీరు ఎలాగూ పనిచెయ్యరు కదా, ఈ మాత్రం దానికి చెప్పడం ఎందుకని ఊరుకున్నాం."

"నేను పని చెయ్యకపోతే ఎవరు చేస్తారు?"

"ప్రీతంసింగ్ గారండి. ఆయనకి ప్రమోషను."

"మరి నేనో?"

"మీరు సిమ్లాలో పెట్టబోతున్న మన కొత్త బ్రాంచికి మేనేజరుగా వెళ్తారు సార్!"

"ఇవన్నీ ఎప్పటి నిర్ణయాలు?" అన్నాను ఆశ్చర్యపడి.

"నిన్నరాత్రి ఎం. డి. గారు నన్ను పిలిపించి ఆర్డర్స్ డిక్టేట్ చేశారు సార్!"

"అలాగా! నన్ను సంప్రదించలేదే?" అన్నాను.

"ఎం. డి. గారు చెప్పారు సార్, మీరు ఢిల్లీ సెమినార్‌లో అద్భుతంగా మాట్లాడారటగా! అలసిపోయి వుంటాడు పాపం; అన్నారండి ఎం. డి. గారు."

అంతా కుట్రలా వుంది- అనుకున్నాను.

"సిమ్లా పోస్టుకి నేను వెళ్ళకపోతే?" అన్నాను.

"అదీ ఆలోచించారండి. అజంతా కేవ్స్ దగ్గర మన బ్రాంచికి సూపరింటెండెంటుగా వెడతారండి మీరు."

"అక్కడ నాకు పెద్దపనేం వుండదే. ఎంతైనా గట్టిగా పది మంది స్టాఫ్ లేనిచోట మూడువేల రూపాయల జీతం పుచ్చుకుంటూ ఎందుకు నేను?"

"ఆ మాటా అనుకున్నారండి. అలాంటప్పుడు రాజస్థాన్‌లో కొత్తగా పెడదామనుకుంటున్న యూనిట్‌కి——"

"నాన్సెన్స్!" కోపంతో అరిచాను. "నన్ను రిజైన్ చెయ్యమని కాబోలు, ఎం. డి. గారి వుద్దేశం!"

"మీరిలా అనుకుంటారని ఎం. డి. గారు ముందే వూహించారండి. సరే, చివరగా ఓమాట చెప్పమన్నారండి. మీరు రిజైన్ చేసే పక్షంలో ఢిల్లీ సెమినార్‌లో మీ ప్రసంగానికి, ఈ ఏర్పాట్లకి ఏమీ సంబంధం లేదని నచ్చచెప్పమన్నారండి."

'సరే-' అని వెనక్కి తిరిగాను; ఇంటికి బయల్దేరుతూ. "రిజిగ్నేషన్ పంపిస్తానని చెప్పు, ఎం. డి. గారితో" అన్నాను.

"అలాగేనండి. కాని రేపు ఎం. డి. గారు ఊళ్ళో వుండరండి. ఈ రాత్రికి మిమ్మల్ని, అమ్మగార్ని డిన్నర్‌కి రమ్మన్నారండి. మీ కిష్టమని స్కాచ్‌విస్కీ తెప్పించారండి. అమ్మగారి కోసం బెనారస్ శారీ కొన్నారండి; ఇదిగో" అని ఒక పాకెట్ తీసి ఇచ్చాడు రాంచంద్. "ఇది కట్టుకుని దయచేయమన్నారండి డిన్నర్‌కి" అన్నాడు.

(16-12-78)

[Art Buchwald కథ ఒకటి చూసి]